# ది ఎటర్నల్ ట్రయాంగిల్

"డబ్బున్న వాళ్ళకు కొండొకచో సిన్సియర్‌గానే ఓ ఘనమైన ఆశయమూ ఉంటుంది. ఆ ఆశయం నెరవేర్చుకొనేందుకు సిన్సియర్‌గానే ప్రయత్నమూ చేస్తారు. నాశనం లేని ఆడామగా, ఎటర్నల్ ట్రయాంగిల్ యీ సిన్సియర్ ప్రయత్నాలను జరగ నిస్తుందా మరి?"

పద్మకి మహా చికాగ్గా ఉంది నచ్చని చీరెల మీద, సేల్స్‌మన్ క్కూడా చాలా చికాగ్గా వుంది. ఎప్పటికీ బేరం తేల్చని ఆవిడ మీద.

ప్రొప్రైటరుకి సూపర్ చికాగ్గా ఉంది చేతకాని సేల్స్‌మాన్ మీదా, డబ్బున్న ఆడవాళ్ళ మీదా.

షాపు గుమ్మంలో నిల్చున్న ముష్టి పిల్లకి చికాకు కాదు గాని బాధగా ఉంది, అరగంటై అరుస్తున్నా అణాకూడా యివ్వని తను చుట్టూ వున్న మనుషుల మీద.

అది ఖాన్ అండ్ ఖాన్ బట్టల షాపు.

ఆ ఊరంతటికీ ఖరీదైన షాపు.

అంటే అక్కడ ఖరీదైన బట్టలుండవు.

అక్కడి బట్టలకి ఖరీదెక్కువ.

పద్మకూడా చాలా ఖరీదైన మనిషి.

ఆవిడ కట్టుకున్న చీర ఖరీదులో అరడజను సంసారాలు ఆర్నెల్లు హాయిగా బతకొచ్చు. ఆవిడ ఒంటిమీదున్న నగల ఖరీదుతో నలుగురు ఆడపిల్లలకి సునాయాసంగా పెళ్ళి చెయ్యొచ్చు.

ఆవిడ మొగుడి ఖరీదు ఒక్కోటీ ముప్ఫై లక్షలు ఖరీదు చేసే మూడు ఫ్యాక్టరీలు.

ఆవిడకి పాతికేళ్ళు. పాతికేళ్ళ ఆడదాని కుండాల్సిన అందం ఉన్నాయి. అందంగా వున్నానన్న అహం కూడా ఉంది.

ఆవేళ పద్మకేం తోచలేదు. నిజం చెప్పాలంటే ఆవేళే కాదు ఏ వేళా ఆవిడ కేం తోచదు. సాధారణంగా ఏం తోచని ఆడ వాళ్ళు నిద్రపోతారు. అయితే డబ్బుండీ ఏం తోచని ఆడవాళ్ళు షాపింగుకి వెళ్తారు. (డబ్బులేని ఆడవాళ్ళకి, మగవాళ్ళక్కూడా – తోచకపోవడం వుండదుట) అంచేత కనీసం పట్టు చీరైనా కొనుక్కుందామని షాపు కొచ్చింది ఆవిడ. కాని, ఛీ! ఛీ అక్కడున్న చీరలన్నీ తన దగ్గరున్నవే. ఈ దిక్కుమాలిన దేశంలో డబ్బుండి కొనుక్కుందామన్న కోరికుండి, కొందామంటే సరైన చీర కూడా దొరక్కపోతే యింకేందుకు? వాట్ ఎడిన్ గ్రేస్? ఇదిగో, ఇలాట ప్పుడే ఆవిడికి అకస్మాత్తుగా అమెరికా పారిపోవాలనిపిస్తుంది. ఏం లాభం? ఆ కోరికా తీరదు. ఆవిడ ఖరీదైన మొగుడికి గల అతి ఖరీదైన ఫ్యాక్టరీలన్నీ ఆవిడ దరిద్రం కొద్దీ యీ దేశంలోనే వుండిపోయాయి. అతను అందరు మగవాళ్ళలాంటివాడు కాదు. అతనికి పద్మంటే చాలా ఇష్టం. కాని డబ్బంటే యింకా ఎక్కు విష్టం. ఎవరైనా సరే ఎక్కువిష్టమైన పన్లే చేస్తారు, కాబట్టి అతను అమెరికా ప్రయాణం ఒప్పుకోవడం లేదు. మనదేశంలో ఆవిడకి చెయ్యాల్సిన పన్లేవీ కనిపించడం లేదు – చీరలు, నగలూ కొనడం, సోఫాలూ, రేడియోలు ప్రతి నెలా మార్చేయడం మినహా.

మనుషుల ఆలోచనలు వాళ్ళ ఖరీదుని బట్టి వుంటాయి (ట). అడుక్కునే వాడికి అమెరికా వెళ్ళాలన్న ఆలోచన రాదు. అలాగే గొప్పవాడికి గుడిసెల్లో వుండాలన్న ఆలోచనరాదు. సర దాకైనా సరే – కలలోనైనా సరే.ఖరీదైన పద్మకి ఎప్పుడూ అతి ఖరీదైన ఆలోచనలే వస్తాయి. తన పేరన ఒక పెద్ద పిల్లల ఆస్పత్రి కట్టిస్తే? అసాధ్యం కాదు. కాని ఆవిడ మొగుడికి పిల్లలన్నా, ఆస్పత్రి అన్నా విపరీతమైన అలర్జీ. పోనీ, స్కూలు గానీ, కాలేజీ గాని కట్టించొచ్చు. అదీ అసంభవం కాదు. కాని ఇప్పటికే ఎక్కువగా వున్న నిరుద్యోగ సమస్యని యింకా ఎక్కువ చెయ్యటం నేషనల్ క్రైమ్.

అవును, సినిమా తియ్యొచ్చు. పర్సనాలిటీ, పాపులారిటీ కూడా పెరుగుతాయి. కానీ ఏ డైరెక్టరూ తనని హీరోయినుగా ఒప్పుకోలేదు. తను అందముగా వున్నప్పటికీ, కనీసం నాలుగు రోజులకో నవల రాసి పారేయ్యొచ్చును. ఆ మధ్యే ఎవరో అన్నారు. ఆడ నవలలకున్న డిమాండు దేనికీ లేదని, డిమాండు వుంటే వుందికాని అందులో పెద్ద థ్రిల్ ఏంవుంటుంది. చేతులు పీకటం తప్ప, ఈ ఆలోచనలన్నిటితోనూ పద్మ మనసేం బాగుం డకనే కాలక్షేపం కోసం షాపింగు కొచ్చింది. అదేం దరిద్రమో కాని షాపింగు కూడా విసుగొచ్చేస్తుంది.

పద్మ కెదురుగా గోడలకి పెద్ద నిలువుటద్దాలున్నాయి. నేలని పట్టు చీరల గుట్టలున్నాయి. పద్మ చీరలవైపు చూడటం లేదు. అద్దాలో కనిపిస్తున్న రోడ్డు మీద పోతున్న కార్లన్నీ, జనాన్నీ, రిక్షాలనీ వగైరాలని చూస్తోంది. ఆ వగైరాలలో అరటంటై అక్కడే

నిల్చుని అడుక్కుంటున్నముష్టి పిల్ల కూడా కనిపించింది. ఆ పిల్ల తల్లిగాని బతికుంటే ఆ పిల్లకి పదిహేనేళ్ళని చెప్పగలదు. ఆ రోజుకి ఆ పిల్ల అన్నం తిని ఆఱ్రోజుల ఒకపూటైంది. కడుపు నిండా మంచినీళ్ళు తాగి అరగంట మీద ఆరు నిముషాలైంది. పుట్టిన దగ్గర్నించి ముష్టెత్తుకునే దాన్లా కాకుండా ఒకప్పుడు బాగా బతికి పరిస్థితుల ప్రభావం వల్ల యీ స్థితికి దిగజారిన దాన్లా అతి దీనంగానూ, అతి ఎపోలజెటిక్‌గానూ వుంది. అను కోకుండా ఆ అమ్మాయిని చూసిన పద్మకి జెల్లకొట్టినట్టు జ్ఞానో దయమైనట్లయింది.

ఇంత మంచి ఆలోచన ఇన్నాళ్లూ తనకెందుకు రాలేదు? ఈ అమెరికా, ఆస్పత్రి వగైరాలు కాకుండా యీలాంటి పిల్లని చేరదీపి చదువు చెప్పించి, పెంచి పెద్దచేస్తే? పెంచితే యీ సైజులో దాన్నే పెంచాలి. మరో చిన్న దాన్ని తెస్తే దానిని తను పెంచినట్టు తెలీదు,తను కన్న పిల్లే అనుకుంటే కృతజ్ఞత ఎలా వస్తుంది! యీ పిల్లని పెంచితే! ఏమిఁ త్రిల్ ! ఎంత పేరు, ప్రతిష్ట!! అప్పుడు పద్మకి కనిపించనది – ఎక్కడో కాలేజి డే జరుగుతోంది. స్టేజి మీద ఎవరో ఇద్దరు మంత్రులు, ఒక టెర్లిన్ తార కూర్చుని వున్నారు. తనూ ప్రభాకర్రావు తమ కోసం ప్రత్యేకంగా వేసి సోఫాల్లో కూర్చున్నారు. పెద్దాపురం పట్టుపంచ, చిన్న సిల్కులాల్చీ, కాశ్మీరు శాలువాతో ప్రభాకర్రావు అచ్చు సినిమా డాడీలా వున్నారు. గమ్మత్తేమిటంటే తను ఇప్పటి లాగే వుంది, మార్పేంలేదు. కళ్ళజోడు తుడుచుకోటానికో, కళ్ళు ఒత్తుకోడానికో గాని ప్రభాకర్రావు అస్తమానూ కళ్ళ జోడుతీసి మళ్ళీ పెట్టుకుంటున్నాడు. స్టేజిమీద ఎవరో మైకు దగ్గర నిల్చుని పేర్లు చదువుతున్నారు. మంచి ఖరీదైన బట్టత్తో ఎంతో అందంగా, అతి నాజూగ్గా వున్న ఆ అమ్మాయి ప్రైజులు వరసగా తీసుకుం టోంది. ఆ అమ్మాయి ప్రైఉ తీసుకున్నప్పుడల్లా అందరూ తనవేపే చూస్తున్నారు. ఒక రిద్దరు ఫోటోలు కూడా తీస్తున్నారు. ఫంక్షను అవగానే ఆ అమ్మాయి పరుగెత్తుకుని వచ్చి ప్రైజులన్నీ ప్రభాకర్రావు చేతిలో పెట్టి తన కాళ్ళకి నమస్కారం చేస్తోంది. తనా అమ్మాయిని అతి గంభీరంగా లేవనెత్తి నుదుటి మీద ముద్దు పెట్టుకుంది. ప్రభాకర్రావు ప్రేమగా ఆ అమ్మాయి తలన నిమి రాడు. ఇల్లంతా పెళ్ళివారితోనూ, పెళ్ళి హడావుడి తోను కళ కళ్ళాడుతోంది. ఎటుచూసినా ఏమిఁజనం! ఎంత కోలా హలం! ఎవరి నోట విన్నా తన పేరే. ఆ అమ్మాయి అదృష్టాన్ని తన మంచి తనాన్ని కలిపి తెగ పొగిడేస్తున్నారు. ఎవరో మూవీ కెమేరాతో ఫోటోలు తీస్తున్నారు. తను ఆనందంతోనూ, అలసటతోనూ, అతి నీరంగా అటూ యిటూ తిరుగుతోంది. వధూవరు లిద్దరూ తన కాళ్ళకి ఒంగి నమస్కారం చేస్తున్నారు. ఆ అమ్మాయి తనని కావలించుకొని వెక్కి వెక్కి ఏడిచేస్తోంది తనను వదలి వెళ్ళనని, తనకీ కన్నీరు ఆగడం లేదు –

చీరల ఎదురుగా కూర్చున్న పద్మకి నిజంగానే కన్నీరు రాబో యింది. వెంటనే తపోభంగం అయిన తపస్వినిలా గబుక్కున లేచి చీరల గుట్టలుదాటుకుంటూ నిద్రలో నడుస్తున్న దాన్లా కారు దగ్గరకి వెళ్ళింది. ఆ అమ్మాయి కూడా పద్మ వెనుకే కారు వరకూ వెళ్ళింది, ఏమైనా యిమ్మని అడుగుతూ. పద్మ ఆ అమ్మాయిని చెయ్యి పట్టుకొని లాగి కారులో కూర్చోపెట్టుకొని కారు స్టార్ట్ చేసింది. పద్మవేపూ, ఆ అమ్మాయి వేపూ, వెళ్ళి పోతున్న కారువేపూ, నిశ్చేష్టులై చూస్తున్న జనం పద్మకి కావలసిన దానికంటే ఎక్కువ ఎంకరేజిమెంటే యిచ్చేరు.

ఏం జరుగుతుందో తెలీని ఆ అమ్మాయి ముందుగా భయ పడింది. తరువాత తనకి అణావో, అర్ధణావో యిచ్చేస్తే దిగి పోతానని బతిమాలుకుంది పద్మని; పద్మ జవాబు ఇవ్వలేదు. పోనీ ఏఁవీఁ యివ్వనవసరం లదేనది, కనీసం కారాపేస్తే దిగి పోతాననీ వేడుకుంది. అయినా జవాబివ్వని పద్మ గంభీరతను చూసి బెదిరిపోయి కుక్కపిల్లలా మూలని ఒదిగి కూర్చుంది.

ఇల్లు చేరిన వెంటనే పద్మ పనిమనిషిని కేకవేసి ఆ అమ్మా యిని తీసికెళ్ళి అర్జంటుగా స్నానం చేయించి, బట్టలు మార్పించి తీసుకురమ్మంది. ఆ అమ్మాయికి అర్జంటుగా కావాల్సినవి స్నానం, పట్టుబట్టలు, అగరొత్తులూ కావనీ కేవలం పిడికెడు అన్నం మాత్రం అర్జంటనీ ఖరీదయిన ఆలోచనల పద్మకి తట్ట లేదు. ఏ గది ఆ అమ్మాయికి కేటాయించాలి, ఏ బట్టలు కొనాలి వగైరాలు ఆలోచిస్తున్న పద్మని 'ఏం కొన్నారు రాణీగారు?' అంటూపలకరించేడు అప్పుడే వచ్చిన ప్రభాకర్రావు.

అతనికి ముప్ఫైఏళ్లూ, మూరెడు గెడ్డం వున్నాయి. అతని ప్రశ్నకు జవాబివ్వకుండా అతని వేపొక సుపీరియర్ నవ్వొకటి విసిరింది పద్మ. నిజానికతనికి, ఆనవ్వు అర్థం కాలేదు. అర్థం కాదని ఆవిడ నమ్మకం. అర్థం చేసుకోనవసరం లేదని అతని ఉద్దేశం. అతను ఆడవాళ్ళని, వాళ్ళ నవ్వుల్నీ అతి లైట్‌గానూ, డబ్బుని అతి సీరియస్‌గానూ, తీసుకుంటారు. అందుకే చక్కగా

కాళ్ళు చాపుకొని సోఫాలో పడుకొని పేపరు చదువుకుంటు న్నాడు. "ఏవిఁటి విశేషం" అని అడుగుతాడనీ, అప్పుడతనికి తన గొప్పదనం అతి డ్రమెటిక్ వర్ణించి చెప్దామని ఆశించిన పద్మకి అతని వాలకం పిచ్చికోపం తెప్పించింది.

ఛీ ... ఛీ.... ఏం మగాళ్ళు? డబ్బుండగానే సరా టేస్ట్ వుండొద్దూ? నిజంగా తను చెయ్యబోయే పనికి అతను ఎంకరేజ్ చేస్తే ఎంత బావుంటుంది? కానీ అసలు ప్రపంచంలో ఏ మొగాడు ఏ ఆడదాన్ని – ముఖ్యంగా పెళ్ళాన్ని ఎంకరేజ్ చేసేడు? నెవర్.

అసలేం చెప్పకూడదు ఇతనితో, ఎందుకూ చెప్పడం? మంచి పని చెయ్యడానికి ఒకరి పర్మిషన్ దేనికి? ముందుగా చెప్పడం కంటే ఒక్కసారే సర్‌ప్రైజూ, సస్పెన్సూ కలుగచెయ్యాలి.

ఏవో ఆలోచిస్తూ అడుగుల చప్పుడికి తలెత్తిన పద్మ ఎదురుగా నిల్చున్న ఆ అమ్మాయిని జూసి ఆశ్చర్యపోయింది.

"ఏ అలంకరణా లేకపోతే యిం అందంగావున్న యీ పిల్ల అందం అన్నీ అమరిస్తే ఎవరాపగలరు?" అనుకుంది.

సరిగ్గా అదే సమయంలో అదే అడుగుల చప్పుడికి తలెత్తి పేపరు కింద నుండి కాజువల్‌గా చూసిన ప్రభాకర్రావు కళ్ళతో గమ్మత్తయిన మెరుపు మెరిసింది. ఆ మెరుపు చూసిన పద్మకి వెంటనే "వాట్ ఎ బ్యూటీ" అన్న అతని మాటలు పిడుగుల్లా వినిపించేయి. ఆవిడ అరసెకండు కాలం అతని వేపు, ఆ అమ్మాయివేపు మార్చి మార్చి చూసింది. ఆ అరసెకండులో ఆవిడకిఎన్ని యుగాల చరిత్ర కనిపించిందో కానీ ఏం మాట్లాడకుండా పక్క గదిలోకి వెళ్ళిపోయింది. పేపరు చదువుకోవటమో, ఆ అమ్మాయిని మళ్ళీ చూడ్డమో తేల్చుకోలేని ప్రభాకర్రావు పద్మ వెళ్ళినవేపే చూస్తూ కూర్చున్నాడు.

అయిదు నిమిషాల తర్వాత పనిమిషి వచ్చి ఆ అమ్మాయి చేతిలో ఒక మూడు రూపాయలు పెట్టి పంపించేసింది.

(ఎప్పుడో, ఎక్కడో యిలాంటి కథ చదివిన జ్ఞాపకం, లేక కనగన్నానో)

**(జ్యోతి, దీపావళి 10.11.1973)**

# ది స్మోకింగ్ డాగ్

**ఆ** సాయంత్రం చాలా అద్భుతంగా వుంది. జీవితమంతా యిలాంటి సాయంత్రాలే అయితే ఎంత బావుంటుంది. బంగారు సూర్యుడు అప్పుడే అస్తమిస్తున్నాడు. ఆకాశమంతా సముద్రమా అన్నంత నీలిగా వుంది. దూరంగా నదిలో వెళ్తున్న పడవ తేల్తున్న మబ్బు ముక్కలా వుంది. సరుగుడు తోటలో నుంచి వస్తున్న చల్లగాలి చల్లటి సెంటువాసనలు పరుస్తోంది. ఇంకా చీకటి పడకుండానే వెలిగించిన వీధి దీపాలు లేత నక్షత్రాల్లా వున్నాయి. తనమీద మనిషికి యింకా నమ్మకం పోకుండా వుండడానికేమో భగవంతుడు అప్పుడప్పుడు అలాంటి సాయంత్రాలు సృష్టిస్తాడు!

చిక్కటి చీకటి నల్లని తివాసీని భూమ్యాకాశాల మీద పరుస్తూ వుంటే చూస్తూ నిల్చున్నాను బాల్కనీమీద. హడావిడిగా యింటికి పారిపోతున్న పశువుల్లా వున్నాయి. రోడ్డుమీద పోతున్న కార్లు, నేను ప్రతిదానికీ విమర్శించే మొగుడ్నీ, ప్రతిదానికీ ఆర్గ్యుమెంట్ చెప్పి, చెప్పిన మాట వినని పిల్లల్ని, విప్లవకారుడులాంటి కుక్కనీ, జీతం అంతా రిపేరుకే తినేసే డొక్కు కారునీ, ఉడికీ ఉడకని వంటనీ–అన్నింటినీ మరిచి పోగలిగి, ప్రపంచాన్ని మరచి బీచిలో ఆల్చిప్పలేరుకునే చంటి పిల్లాడిలా అలా ఎంతసేపు నిల్చున్నానో నాకే తెలీదు.

ఇంతలో కింద కాంపౌండులో గంపెడు గవ్వలు ఒక్కసారి ఒలికినట్టు గలగల నవ్వులు వినిపించగానే కిందికి చూసేసరికి మా కుర్రడాక్టర్ల గ్రూపు వచ్చేసింది. మా పిల్లలంటే నాకెంత యిష్టమో వీళ్ళన్నా నాకంతే ఇష్టం. ఎంతో అమాయకంగా, నిస్సహాయంగా కనిపించే వీళ్ళు ఎంత భయంకర ప్రపంచంలో ఎలా బ్రతకగలరో అని ఆలోచిస్తే విపరీతమైన జాలి, భయం వేస్తాయి నాకు. మెడిసన్‌తో సహా ప్రపంచంలో ఎన్నో విషయాల గురించి తెలీని వీళ్ళు అన్నీ తెలుసనుకుంటారు. "నాయకుళ్ళుల్లారా! మీకు తెలీని ప్రపంచం చాలా వుంది. మీరింకా అర అదివారం నక్కలు అని నేనెన్నోసార్లు చెప్పినా వాళ్ళు వినరు. వాళ్ళలోని ఆ పసితనమే నాకు చాలా ఇష్టం.

వాళ్ళని రిసీవ్ చేసుకోవడానికి గబగబా కిందికి దిగే సరికి వాళ్ళప్పుడే డ్రాయింగు రూములో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అందరికీ ఒకే స్వాగతం నవ్వు పారేసి